RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 317 పేజీలు - 08 ఆదివారం 11 అక్టోబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక



# ఢిల్లీలో నిరసనలపై పోలీసుల ఉక్కుపాదం!

**- కేజ్రీవాల్, మమతా బెనర్జీ సహా నలుగురు మాజీ సీఎంల అదుపులోకి.. 1,500 మందికి పైగా నిర్బంధం**

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,అక్టోబర్ 10:** ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరిగా యం టూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో చేపట్టిన నిరసనలపై పోలీసులు చర్యలు చేప ట్టారు. శనివారం రాజధానిలో మిగతా2లో...

# ఎల్‌నినో ముప్పుపై ప్రభుత్వం అప్రమత్తం!

**● కొవిడ్ తరహాలో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయండి ● నీరు, విద్యుత్ పొదుపునకు ప్రత్యేక చర్యలు.. అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు**

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 10 :** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాలపై పడే ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి, సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రానున్న పరిస్థితులను ఎదుర్కొనేందుకు కొవిడ్ సమయంలో అనుసరించిన విధానంలోనే ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం, నీటి లభ్యతపై ఒత్తిడి పెరగడం వంటి పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సీఎం పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా



వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, తాగునీరు, సాగునీటి అవసరాలకు ఇబ్బందులు కలగకుండా ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. నీటి వృథాను అరికట్టడంతో పాటు ప్రజల్లో నీటి పొదుపుపై అవగాహన పెంచాలని సూచించారు. విద్యుత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి, సరఫరాలో అంతరాయాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే విద్యుత్ కొనుగోలుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని తెలిపారు. వ్యవసాయ రంగంపై ఎల్‌నినో మిగతా2లో...

# రాజ్యాంగ సంస్థలపై రాజకీయాలు వద్దు!

**- ఓట్ల తొలగింపుపై ప్రతిపక్షాల విమర్శలు సరికాదు.. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు**



**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 10 :** రాజ్యాంగబద్ధ సంస్థలను రాజకీయ వివాదాల్లోకి లాగడం సరికాదని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ఎన్నికల సంఘంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు, ఓట్ల తొలగింపు మిగతా2లో...

# నవంబర్ 19నుంచి ఇందిరమ్మ బీమా!

**- కుటుంబ పెద్ద మరణిస్తే రూ.5 లక్షల బీమా.. పథకం ప్రారంభానికి ప్రభుత్వం సన్నాహాలు**



**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 10 :** రాష్ట్రంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని నవంబర్ 19న ప్రారంభించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. కుటుంబ పెద్ద ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5 లక్షల బీమా సాయం అందించేలా పథకాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు. శనివారం ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలోని పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ఇందిరమ్మ బీమా మిగతా2లో...



# 'సర్'పై కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టండి!

**బీజేపీ శ్రేణులకు రాంచందర్‌రావు పిలుపు**

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 10 :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలు, అధికార ప్రతినిధులు, వివిధ విభాగాల కన్వీనర్లు, మీడియా మిగతా2లో...

# జగన్‌కు ఈడీ షాక్..

**● అక్రమాస్తుల కేసులపై హైకోర్టును ఆశ్రయించిన ఏజెన్సీ**

**● జగన్ అక్రమాస్తుల కేసులపై తెలంగాణ హైకోర్టులో ఈడీ పిటిషన్**

**● రోజువారీ విచారణ జరపాలని పిటిషన్‌లో అభ్యర్థన**




**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 10 :** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్' (ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసుల్లో రోజువారీ విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు మిగతా2లో...

# ఏపీలో బీసీ రిజర్వేషన్లకు కేబినెట్ ఆమోదం!

**స్థానిక సంస్థల్లో పదవుల వారీగా రిజర్వేషన్లు ఖరారు**

**మేయర్ పదవులకు 35.29 శాతం.. సర్పంచులకు 27.95 శాతం**



**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 10 :** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశం ఆమోదం తెలిపింది. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫార్సులను ఆమోదిస్తూ పదవుల వారీగా రిజర్వేషన్ల శాతాలను ఖరారు మిగతా2లో...

# దేశాన్ని అస్థిరపరిచే కుట్రలు సాగవు!

**● ఇండియా కూటమి, సీజేపీపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపణలు ● విదేశీ శక్తుల ఆదేశాలతో ఆందోళనలు చేస్తున్నారంటూ విమర్శలు**




# రాహుల్‌గాంధీతో విజయ్ భేటీ..

**● కాఫీతో రాజకీయ ముచ్చట్లు!**

**● గంటపాటు కీలక చర్చలు.. కేఫ్‌లో అభిమానులతో సెల్ఫీలు**



**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 10 :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత సి. జోసెఫ్ విజయ్ చెన్నైలో సమావేశమయ్యారు. నీలాంకరైలోని విజయ్ నివాసంలో సుమారు గంటపాటు వివిధ రాజకీయ అంశాలపై చర్చించారు. అనంతరం ఇద్దరూ సమీపంలోని కేఫ్‌కు వెళ్లి కాపుచినో కాఫీ, తిరమిసు, కుకీలు ఆస్వాదించారు. ఈ సందర్భంగా కేఫ్‌లో ఉన్న అభిమానులు ఇద్దరు నేతలను చూసేందుకు ఆసక్తి చూపించారు. పలువురు వారితో సెల్ఫీలు దిగారు. రాజకీయ చర్చల మిగతా2లో...

# దేశాన్ని అస్థిరపరిచే కుట్రలు సాగవు!

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 10 :** దేశంలో అస్థిరత సృష్టించేందుకు ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నేతృత్వంలోని ఇండియా కూటమి, సీజేపీతో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అనుచరులు ఈ ప్రయత్నాల్లో భాగస్వాములుగా ఉన్నారని విమర్శించారు. శాంతి సామరస్యాలతో జీవిస్తున్న దేశ ప్రజల మధ్య ఉద్రిక్తతలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. శనివారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినప్పటికీ ప్రతిపక్షాలు తమ వైఖరిని మార్చుకోవడం లేదని విమర్శించారు. ప్రజల తీర్పు నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన నాయకులు దేశాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం, విదేశీ శక్తుల ఆదేశాల మేరకు ఆందోళనలు నిర్వహిస్తున్నారని వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా సంక్షోభ పరిస్థితులు ఉన్నప్పటికీ భారత్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని నితిన్ నబీన్ పేర్కొన్నారు. దేశ పురోగతిని కొందరు జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు. ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించే దిశగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. రాజ్యాంగం పేరుతో ప్రజాస్వామ్య వ్యవస్థను సవాలు చేయడాన్ని ప్రజలు అంగీకరించరని అన్నారు. దేశంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలను ప్రభుత్వం కఠినంగా ఎదుర్కొంటుందని హెచ్చరించారు. దేశభక్తులంతా ఐక్యంగా నిలిచి ఇలాంటి ప్రయత్నాలను అడ్డుకుంటారని నితిన్ నబీన్ వ్యాఖ్యానించారు.

# నవంబర్ 19నుంచి ఇందిరమ్మ బీమా!

(మొదటి పేజీ తరువాయి)

పథకాన్ని అమలు చేయనున్నట్లు వివరించారు. రాష్ట్రంలో సుమారు 1.15 కోట్ల కుటుంబాలు ఉండగా, దాదాపు 1.06 కోట్ల కుటుంబాలకు చెందిన 3.42 కోట్ల మందికి ప్రతినెలా ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు భట్టి తెలిపారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.రైతుల సంక్షేమం కోసం సుమారు 72 లక్షల మంది రైతులకు రైతు భరోసా అందించామని చెప్పారు.

గృహజ్యోతి పథకం ద్వారా సుమారు 53 లక్షల కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.ఇందిరమ్మ బీమా పథకం ద్వారా కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పథకం అమలుకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు, అర్హతలు, పరిహారం చెల్లింపు విధివిధానాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి!

### సర్వోత్తమ్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

### ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి.. పార్టీ శ్రేణులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపు



**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 10 :** ఖమ్మంవరంగల్‌నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పట్టభద్రులను నేరుగా కలవాలని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వారికి వివరించాలని సూచించారు. ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని స్పష్టం చేశారు.ఖమ్మంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ముఖ్యంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వ చర్యలను పట్టభద్రులకు వివరించి, వారి విశ్వాసాన్ని పొందాలని పార్టీ శ్రేణులకు సూచించారు.**యువతకు ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యం** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు సుమారు 70 వేల ఉద్యోగాలు కల్పించినట్లు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్లు విడుదల చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించి, ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు కూడగట్టాలని సూచించారు. **ఉద్యోగుల సంక్షేమానికి చర్యలు** ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఉద్యోగులకు సంబంధించిన బకాయిల చెల్లింపులపై దృష్టి సారించామని తెలిపారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల్లో సుమారు రూ.9 వేల కోట్లను చెల్లించినట్లు వెల్లడించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యోగులు, నిరుద్యోగులు, యువత, విద్యావంతుల సమస్యలను అర్థం చేసుకుని వారికి ప్రభుత్వ విధానాలను వివరించాలని పార్టీ నాయకులకు సూచించారు. ప్రతి ఓటరును కలవడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు.**సమన్వయంతో పనిచేయాలి** ఎన్నికల్లో విజయం సాధించాలంటే పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం ఎంతో ముఖ్యమని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా బాధ్యతలు తీసుకుని ప్రచారాన్ని విస్తృతం చేయాలని సూచించారు. పట్టభద్రుల ఓటర్ల జాబితాను పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరును సంప్రదించాలని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి సర్వోత్తమ్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తూ, భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పలువురు ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచార కార్యక్రమాలు, పట్టభద్రులను సంప్రదించే విధానాలపై చర్చించినట్లు తెలిసింది.

# రేడియల్ రోడ్-2 టెండర్లలో భారీ కుంభకోణం!

### తక్కువ ధరకు బిడ్లు వేసిన సంస్థలకు అన్యాయం జరిగిందని కేటీఆర్ ఆరోపణలు

### రూ.3,296 కోట్ల ప్రాజెక్టుపై సమగ్ర విచారణ జరపాలి.. టెండర్లు రద్దు చేయాలి




**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 10 :** రాష్ట్రంలో రూ.3,296 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన రేడియల్ రోడ్-2 నిర్మాణ టెండర్లలో అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. నచ్చిన సంస్థలకే పనులు కట్టబెట్టేందుకు టెండర్ల ప్రక్రియను నిర్వహించారనే అనుమానాలు వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. టెండర్లను రద్దు చేసి, మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.బుద్వేల్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కొడంగల్ సమీపంలోని జాతీయ రహదారి 167ఎన్ వరకు 81.15 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి ప్రభుత్వం మూడు ప్యాకేజీలుగా టెండర్లు పిలిచింది. గత నెల 30వ తేదీతో బిడ్ల దాఖలు గడువు ముగియగా, ఈ నెల 8వ తేదీ నాటికే సాంకేతిక మూల్యాంకనం, బిడ్డర్ల అర్హతల పరిశీలన, ఆర్థిక బిడ్ల పరిశీలన, కేటాయింపుల ప్రక్రియ పూర్తయినట్లు సంబంధిత పత్రాల్లో పేర్కొన్నారని కేటీఆర్ తెలిపారు.రూ.3,296 కోట్ల భారీ ప్రాజెక్టుకు సంబంధించి 13 బిడ్ల పరిశీలన, అర్హతల నిర్ధారణ, పనుల కేటాయింపుల ప్రక్రియను సెలవులు మినహాయిస్తే కేవలం ఐదు పని దినాల్లోనే ఎలా పూర్తి చేశారని ఆయన ప్రశ్నించారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకతపై అనుమానాలు ఉన్నందున ప్రభుత్వం పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని కోరారు.ప్రతి ప్యాకేజీకి ఎన్ని సంస్థలు బిడ్లు దాఖలు చేశాయి? ఎన్ని సంస్థలు అర్హత సాధించాయి? ఏ సంస్థ ఎంత ధరను కోట్ చేసింది? అంచనా వ్యయంతో పోలిస్తే తుది కేటాయింపు ఎంత ఎక్కువగా ఉంది? వంటి వివరాలను వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఒకే సంస్థను ఒక ప్యాకేజీలో అర్హంగా, మరో ప్యాకేజీలో అనర్హంగా ఎలా ప్రకటించారని ప్రశ్నించారు.అతి తక్కువ ధరకు బిడ్లు వేసినట్లు చెబుతున్న సుషీ ఇన్‌ఫ్రా అండ్ మైనింగ్ లిమిటెడ్‌ను మూడు ప్యాకేజీల్లోనూ అనర్హంగా ప్రకటించడంపై కూడా కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల మూడు ప్యాకేజీల్లో కలిపి రాష్ట్రానికి సుమారు రూ.600 కోట్ల నష్టం వాటిల్లుతుందని సదరు సంస్థ తరఫున కోర్టులో సమర్పించిన వాదనల్లో పేర్కొన్నట్లు ఆయన వెల్లడించారు. టెండర్ల కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని కేటీఆర్ కోరారు. టెండర్ల ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను బహిర్గతం చేసి, నిష్పక్షపాతంగా విచారణ జరిపిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అయితే, ఈ అంశంపై కేటీఆర్ చేసినవి ఆరోపణలు కాగా, వాటిపై ప్రభుత్వ వివరణ లేదా విచారణ ఫలితాలు వెలువడాల్సి ఉంది.

# ఢిల్లీలో నిరసనలపై పోలీసుల ఉక్కుపాదం!

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన ఆందోళనల సందర్భంగా 1,500 మందికి పైగా నిరసనకారులను నిర్బంధించారు. వారిలో నలుగురు మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, పినరయి విజయన్, మాణిక్ సర్కార్ ఉన్నారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అవకతవకలు జరిగాయంటూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద ఆందోళనకు పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో పోలీసులు భారీగా మోహరించి, పలు ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు.నిరసనలో పాల్గొనేందుకు వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో పాటు కేరళ మాజీ సీఎం పినరయి విజయన్, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు కూడా నిర్బంధానికి గురయ్యారు.ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును అణచివేస్తున్నారని ప్రతిపక్ష నాయకులు విమర్శించారు. ఓటర్ల జాబితాలో అక్రమాలపై సమాధానం చెప్పాల్సిన ఎన్నికల సంఘం, నిరసనలను అడ్డుకోవడంపై దృష్టి పెట్టిందని ఆరోపించారు. మరోవైపు, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని పోలీసులు పేర్కొన్నారు.ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో రాకపోకలపై ఆంక్షలు విధించడంతో పాటు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణ, ఎన్నికల సంఘం పనితీరుపై అధికార, ప్రతిపక్షాల మధ్య వివాదం మరింత ముదిరింది.

## రాజ్యాంగ సంస్థలపై రాజకీయాలు వద్దు!

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపణలపై ఆయన స్పందించారు. ఓట్లను భారీ సంఖ్యలో తొలగించారన్నది అపోహ మాత్రమేనని పేర్కొన్నారు.ప్రతిపక్షాలు అతిగా వ్యవహరిస్తున్నాయని వెంకయ్య నాయుడు విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేయాలంటూ వస్తున్న డిమాండ్లు సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగబద్ధ సంస్థల పనితీరును రాజకీయాలతో ముడిపెట్టడం తగదని సూచించారు.ఎన్నికల్లో విజయం సాధించినప్పుడు గొప్పలు చెప్పుకోవడం, ఓటమి ఎదురైనప్పుడు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఈవీఎంలను) నిందించడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఎన్నికల వ్యవస్థపై విమర్శలు చేసేటప్పుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.రాజ్యాంగ సంస్థలను వీధుల్లోకి లాగడం వల్ల దేశ ప్రతిష్ఠకు భంగం కలిగే అవకాశం ఉందని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. ప్రతిపక్షాలు ఈ అంశంపై ఎందుకు వివాదం చేస్తున్నాయో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. రాజకీయ విభేదాల కంటే దేశ ప్రతిష్ఠకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు.

## జగన్‌కు ఈడీ షాక్..

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వాలని ఈడీ తన పిటిషన్‌లో అభ్యర్థించింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులకు సంబంధించి ఈడీ దాఖలు చేసిన తొమ్మిది చార్జిషీట్లు దాదాపు దశాబ్ద కాలంగా సీబీఐ ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని ఈడీ తెలిపింది. నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్ల పరిష్కారం కాకపోవడం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని పేర్కొంది. విచారణకు జగన్‌తో పాటు ఇతర నిందితులంతా వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఆదేశించాలని కూడా ఉన్నత న్యాయస్థానాన్ని కోరింది.గత కొన్నేళ్లుగా ఈ కేసుల్లో ప్రత్యేక కోర్టుల విచారణ, ఉన్నత న్యాయస్థానాల్లో సవాళ్లు వంటి పలు న్యాయపరమైన ప్రక్రియలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణ జరగాల్సి ఉంది.

## ఏపీలో బీసీ రిజర్వేషన్లకు కేబినెట్ ఆమోదం!

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. సుప్రీంకోర్టు తీర్పు, నిబంధనలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రులు వెల్లడించారు.గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు 26.73 శాతం, సర్పంచులకు 27.95 శాతం, ఎంపీటీసీలకు 25.55 శాతం, ఎంపీపీలు, జెడ్పీటీసీలకు 24.60 శాతం, జెడ్పీ చైర్‌పర్సన్లకు 23.08 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించారు. పట్టణ ప్రాంతాల్లో వార్డు సభ్యులకు 32.78 శాతం, మున్సిపల్ చైర్‌పర్సన్లకు 33.02 శాతం, మేయర్ పదవులకు 35.29 శాతం రిజర్వేషన్లు ఖరారు చేశారు.స్థానిక సంస్థల్లో బీసీలకు చట్టపరంగా రిజర్వేషన్లు అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రులు తెలిపారు. ఈ సిఫార్సుల ఆధారంగా తదుపరి ప్రక్రియ కొనసాగనుంది.

## రాహుల్‌గాంధీతో విజయ్ భేటీ..

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం సాధారణంగా అభిమానులతో ముచ్చటిస్తూ కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.విద్యార్థులతో సమావేశంలో పాల్గొనేందుకు చెన్నై వచ్చిన రాహుల్‌గాంధీ.. విజయ్‌తో భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కాంగ్రెస్, టీవీకే మధ్య సమన్వయం, రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, భవిష్యత్తు రాజకీయ అంశాలపై చర్చించినట్లు సమాచారం. అయితే సమావేశంలో చర్చించిన అంశాలపై ఇరు పార్టీల నుంచి అధికారిక వివరాలు వెల్లడికాలేదు.

## ఎల్‌నినో ముప్పుపై ప్రభుత్వం అప్రమత్తం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభావాన్ని పరిశీలించి, రైతులకు అవసరమైన సహాయం అందించేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితులను నిరంతరం సమీక్షించాలని సీఎం ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్పష్టం చేశారు.

## 'సర్'పై కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టండి!

(మొదటి పేజీ తరువాయి)

ప్రతినిధులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను రూపొందిస్తోందని పేర్కొన్నారు. బోగస్ ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను ఖండించారు. వరుస ఎన్నికల ఓటములతోనే కాంగ్రెస్ రాజ్యాంగ సంస్థలపై విమర్శలు చేస్తోందని ఆరోపించారు. 'ఓట్ చోరీ' ప్రచారాన్ని ప్రజల్లో వాస్తవాలతో తిప్పికొట్టాలని, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి కలిగించే ప్రయోజనాలను వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

# పూలను పూజించి ప్రకృతిని ఆరాధించే సంస్కృతికి

# ప్రతీక బతుకమ్మ పండగ

**• అంగరంగ వైభవంగా తెలంగాణ రాష్ట్ర పండుగ వేడుకలు ప్రారంభం • తొమ్మిది రోజుల పాటు సాగే పూల పండుగ విశేషాలు**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) అక్టోబర్ 10:** తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, అచ్చతెలుగు ప్రకృతి పూజల పండగ బతుకమ్మ వేడుకలు నిన్నటి నుంచి ప్రారంభమయ్యాయి. ప్రతి ఇంటిలో పూలతో నిండి, మహిళల్లో ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని రేకెత్తించే ఈ పండగకు రాష్ట్రంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా విశేష ప్రాచుర్యం ఉంది. భాద్రపద మాసంలో మొదలై తొమ్మిది రోజుల పాటు సాగే ఈ వేడుక తెలంగాణ అస్తిత్వానికి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. అత్తవారింటి నుంచి పుట్టింటికి చేరి, తీరొక్క పూలను సేకరించి బతుకమ్మలను పేర్చి అంగరంగ వైభవంగా ఈ పండుగను జరుపుకుంటారు. రంగవల్లుల మధ్య పూలను పేర్చి అందంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ స్త్రీలు వలయంగా తిరుగుతూ, గౌరీదేవి కీర్తనలు పాడుతూ సందడి చేస్తారు. ఆనందం, ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవం కలిగిన ఈ పండగ వెయ్యేళ్ల చరిత్ర కలిగి ఉందని ఇతిహాసాలు చెబుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ పండగ మరింత ప్రాధాన్యం సంతరించుకుని రాష్ట్ర పండగగా అధికారిక గుర్తింపు పొందింది.

**తొమ్మిది రోజుల బతుకమ్మ విశిష్టత – నైవేద్యాలు**

మొదటి రోజు (ఎంగిలి పూల బతుకమ్మ): మహాలయ అమావాస్య రోజున ఈ వేడుక మొదలవుతుంది. ముందు రోజే సేకరించిన పూలను నీటిలో ఉంచి, మరుసటి రోజు ఆకులతో బతుకమ్మగా పేర్చుతారు. నువ్వులు, బియ్యం పిండితో నైవేద్యం సమర్పిస్తారు. రెండవ రోజు (అటుకుల బతుకమ్మ): ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి రోజు జరుపుకుంటారు. తంగేడు, గునుగు, బంతి పూలతో బతుకమ్మను పేర్చి అటుకులు, బెల్లం, శనగపప్పును నైవేద్యంగా సమర్పిస్తారు. మూడవ రోజు (ముద్దపప్పు బతుకమ్మ): తంగేడు, మందార పూలతో అలంకరించి ముద్దపప్పు, బెల్లం నైవేద్యంగా పెట్టి సామూహికంగా నిమజ్జనం చేస్తారు. నాల్గవ రోజు (నాణేలయ్యం / నానబియ్యం బతుకమ్మ): అష్టమి నాడు తంగేడు, గునుగు పూలతో బతుకమ్మను పేర్చి నానబెట్టిన బియ్యం, పాలు, బెల్లం నైవేద్యంగా నివేదిస్తారు. ఐదవ రోజు (అట్ల బతుకమ్మ): అట్లతద్ది నాడు రకరకాల పూలతో బతుకమ్మను తయారు చేసి, అట్లు (దోశలు) నైవేద్యంగా సమర్పిస్తారు. ఆరవ రోజు (అలిగిన బతుకమ్మ): ఈ రోజు బతుకమ్మను పేర్చరు. అమ్మవారు అలిగిందని భక్తుల నమ్మకం. ఈ రోజు ఎలాంటి వేడుకలు చేయకుండా ఉపవాసం ఉంటారు. ఏడవ రోజు (వేపకాయల బతుకమ్మ): తంగేడు, గులాబీ పూలతో బతుకమ్మను పేర్చి, బియ్యం పిండిని వేయించి వేపకాయల ఆకారంలో చేసి నైవేద్యం పెడతారు. ఎనిమిదవ రోజు (వెన్నముద్దల బతుకమ్మ): రకరకాల పూలతో బతుకమ్మను పేర్చి, వెన్న, నెయ్యి, బెల్లం కలిపిన పదార్థాలను నైవేద్యంగా సమర్పిస్తారు. తొమ్మిదవ రోజు (సద్దుల బతుకమ్మ – ముగింపు): పండుగలో చివరి రోజైన సద్దుల బతుకమ్మ అత్యంత వైభవంగా సాగుతుంది. పులిహోర, దద్ధోజనం, కొబ్బరి అన్నం, నువ్వులన్నం, చారల అన్నం వంటి ఐదు రకాల నైవేద్యాలతో బతుకమ్మను పూజించి, చెరువులో నిమజ్జనం చేస్తారు.

**పూల పండుగతో ఆరోగ్య ప్రయోజనాలు**

బతుకమ్మ వేడుకల్లో భాగంగా పేర్చే వివిధ రకాల పూల స్పర్శ వల్ల మహిళల్లో మానసిక ప్రశాంతత కలగడమే కాకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నట్లు ఆయుర్వేద నిపుణులు పేర్కొంటున్నారు: తంగేడు పూలు: శరీరంలోని వేడిని, కొవ్వును తగ్గించి, అనవసర పొట్టను అణచివేయడంలో సహాయపడతాయి. గునుగు పూలు: గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో కాల్షియం, ఫాస్ఫరస్, విటమిన్లు పుష్కలంగా ఉండి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. బంతి పూలు: చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో మరియు కడుపులోని నులిపురుగుల నివారణలో ఆయుర్వేదంలో ఉపయోగిస్తారు. తామంతి పూలు: కంటి చూపును మెరుగుపరచడంలో, రాత్రి మంచి నిద్ర పట్టడంలో మరియు మానసిక ప్రశాంతతను అందించడంలో తోడ్పడతాయి. (ప్రత్యేక వార్త – తొలి అక్షరం దినపత్రిక సీనియర్ జర్నలిస్ట్ పస్తం సాంబ, తొర్రూర్)



తొలి అక్షరం దినపత్రిక సీనియర్ జర్నలిస్ట్ పస్తం సాంబ ఫ్రాం తొర్రూర్ అనువంశిక ఆయుర్వేదిక్ వైద్యుడు

## ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) అక్టోబర్ 10:** తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే బతుకమ్మ సంబరాలు మండలంతో పాటు తొర్రూరు పట్టణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఎంగిలి పూల బతుకమ్మ సందర్భంగా మహిళలంతా ఒక్కచోట చేరి ఆడిపాడుతూ సంబరాలు చేసుకున్నారు. ఆయా ప్రాంతాల చెరువుల పరిసరాల్లో అందమైన బతుకమ్మలు కనివిందు చేశాయి. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి పడతులు పులకించిపోయారు. మహిళలు తీరొక్క పూలతో భక్తిశ్రద్ధలతో బతుకమ్మను పేర్చారు. బతుకమ్మ వేడుకలతో తొర్రూరు పెద్ద చెరువు పరిసరాలు వెలుగులీనాయి. వందలాది మంది మహిళలు ‘బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో‘ అంటూ ఆడిపాడారు. మహిళలంతా సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ ఆడారు. మాజీ కౌన్సిలర్ దొంగరి రేవతి శంకర్, లయన్స్ క్లబ్ ప్రతినిధి శారద, మహిళలు బతుకమ్మలతో చెరువు వద్దకు వెళ్లారు.

## హైకోర్టు ఆదేశాల అమలులో జాప్యం

**రాష్ట్ర ప్రభుత్వంపై కోర్టు ధిక్కరణ పిటిషన్‌కు సిద్ధమవుతున్న మామిడి సోమయ్య**




**ఖమ్మం, అక్టోబర్ 10 (తొలి అక్షరం):** మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)కు ప్రాతినిధ్యం కల్పించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో జాప్యం జరుగుతోందని పేర్కొంటూ, రాష్ట్ర ప్రభుత్వంపై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసేందుకు టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య సిద్ధమవుతున్నారు. రాష్ట్ర, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో తమ సంఘానికి ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ మామిడి సోమయ్య హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని ఆగస్టు 3న ఆదేశించినట్లు సమాచారం. ఈ ఆదేశాలను ఆరు వారాల్లో అమలు చేయాలని స్పష్టం చేసింది. అయితే గడువు ముగిసినా ఆదేశాలు అమలుకాకపోవడంతో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి న్యాయవాదులు పిటిషన్ ముసాయిదా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, జిల్లా ప్రజాసంబంధాల అధికారులను ప్రతివాదులుగా చేర్చే అవకాశం ఉంది. న్యాయస్థానం ఆదేశాలను నిర్ణీత గడువులో అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందని, ఆదేశాల అమలులో జాప్యంపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తోందని పిటిషనర్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైతే తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

## చౌటుప్పల్ పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా

# చెరుకు లింగస్వామి గౌడ్

**- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సిఫార్సుతో నియామకం**



**తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 10:** చౌటుప్పల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా చెరుకు లింగస్వామి గౌడ్ నియమితులయ్యారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సిఫార్సు మేరకు డీసీసీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆయన నియామకాన్ని ఖరారు చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న లింగస్వామి గౌడ్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు. గతంలో ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి తనవంతు కృషి చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి లింగస్వామి గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. చౌటుప్పల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తోడ్పడతానని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు బీర్ల ఐలయ్యతో పాటు పార్టీ జిల్లా, పట్టణ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఖమ్మం నగర అభివృద్ధి పనులు

# దశలవారీగా పూర్తి చేస్తాం

**రూ.1.55 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లను ప్రారంభించిన మంత్రి తుమ్మల**



**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి అక్టోబర్ 10:** ఖమ్మం నగరంలో అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని 9, 12, 13, 14వ డివిజన్లలో రూ.1.55 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇప్పటివరకు నగరంలో సుమారు రూ.5 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. మిగిలిన చిన్నచిన్న పనులను కూడా త్వరలో చేపట్టి పూర్తి చేస్తామన్నారు. ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా అన్ని డివిజన్లలో అవసరమైన పనులను గుర్తించి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు.

**పుట్టపాకరాజన్నపేట రహదారి నిర్మాణానికి చర్యలు**

పుట్టపాక నుంచి రాజన్నపేట వరకు రహదారి నిర్మాణానికి పంచాయ తీరాజ్ శాఖ ద్వారా నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి సుడా చైర్మన్ పువ్వాడ దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, నాణ్యత విషయంలో రాజీ పడకుండా ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం నగరంలో హిందూ, ముస్లిం, క్రైస్తవులు పరస్పర సోదరభావంతో కలిసి జీవించేలా మతసామరస్యాన్ని కాపాడుతూ నగర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తుమ్మల తెలిపారు. ప్రజలందరూ ఐకమత్యంతో ఉంటూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. సుడా చైర్మన్ పువ్వాడ దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రూ. 70 కోట్లతో పోలేపల్లి గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**- పోలేపల్లి లో రూ. 4.65 కోట్లతో బిటి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి**



**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి అక్టోబర్ 10:**ఖమ్మం రూరల్ మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా రూ. 4.65 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రెండు నూతన బిటి రోడ్ల నిర్మాణ పనులకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఇందులో రూ. 2.42 కోట్ల అంచనా వ్యయంతో పోలేపల్లి నుండి దానవాయిగూడెం (వయా మున్నేరు) వరకు, రూ. 2.20 కోట్ల అంచనా వ్యయంతో పోలేపల్లి నుండి రామునిపేట వరకు బీటీ రోడ్ల నిర్మాణాలు వున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నదని తెలిపారు. సన్న బియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్ (200 యూనిట్లు), ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు వంటి అనేక కార్యక్రమాలు విజయవంతంగా అందిస్తున్నామన్నారు. పోలేపల్లి ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాబోయే కొద్ది రోజుల్లోనే నూతన రేషన్ డీలర్‌ను ఏర్పాటు చేస్తామని మంత్రి అన్నారు. అర్హులైన ప్రతి పేదవానికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ స్కూల్ లో స్థల సమస్య ఉన్నందున, సమీపంలో అనువైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి పిల్లలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నూతన స్కూల్ భవనాన్ని నిర్మిస్తామని మంత్రి తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాల అమలకు కట్టుబడి ఉన్నామని మంత్రి అన్నారు.అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, పిఆర్ ఈఈ మహేష్ బాబు, స్థానిక సర్పంచ్ బత్తిని మహేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పెద్దల అమావాస్య సందర్భంగా గో దాణా వితరణ



**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి అక్టోబర్ 10:** శ్రీ స్థంభాద్రి సేవా సమితి ఆధ్వర్యంలో భాద్రపద మాసంలో వచ్చే యీ విశేష పితృపక్ష అమావాస్య తిథి సందర్భంగా స్థానిక నగర పెద్దలు, దాల్ మిల్ యజమానులు, ఛాంబర్ వ్యాపారులు, రుక్మిణి సిల్క్స్ యాజమాన్యం, గోభక్తులు, మిత్రులు, సేవా సమితి సభ్యుల సహకారముతో రూ.82,000/-ల విలువ కలిగిన తవుడు, గో దాణాకు సంబందించిన చున్నీ, బెల్లం, పచ్చిగడ్డి, కూరగాయలు, ఆకుకూరలను గొల్లగూడెం ఓం శ్రీకృష్ణ గోశాల వారికి రూ 68,000/-, టేకులపల్లి గోశాలకు రూ.11,000/-, 3వ పట్టణములోని వివిధ గోశాలల వారికి రూ.3,000/-ల పచ్చిగడ్డిని దాతల పక్షనా వితరణ చేయడమైనది. ఈ విశేషమైన పోలాల అమావాస్య నాడు గో దాణా కు ధన – వస్తు రూపేణా సహకరించిన యావన్మంది దాతలకు, వారి కుటుంబ సభ్యులకు నడిచే ప్రత్యక్ష దైవం అయిన శ్రీగోమాతల అనుగ్రహం, ఆశిస్సులు కలుగవలెనని ఆయా గోశాలల యజమాన్యముల గోపూజలు చేసి కృతజ్ఞతలు, ధన్యవాదములు తెలియచేసినారు.ఇట్టి గో సేవా కార్యక్రమం లో కన్వీనర్ తూములూరి లక్ష్మీ నరసింహారావు, సభ్యులు పల్లా లింగయ్య సూరినేటి మల్లేశం, దేవరశెట్టి రామారావు, వంగవీటి నవీన్, సుంకర ఎల్లారావు,పెనుగొండ సాయికుమార్, గజ్జి సూర్యనారాయణ, మిట్టపల్లి ప్రభాకర్ రావు, కారంశెట్టి నాగేశ్వరావు, చల్లా రమేష్, పల్లా సూరిబాబు, కురువెళ్ళ వెంకటేశ్వర్లు, శేరి శ్రీనివాసరెడ్డి, ఇద్దెగాని నాగేశ్వరావు, మోత్కురి రవి, కటకం భాస్కర్ రావు, సిరికొండ వెంకటేశ్వర్లు, మలిశెట్టి లక్షణ్ బాబు, వంగవీటి శ్రీనివాసరావు లతో పాటు పలువురు మహిళలు, ప్రముఖులు, దాతలు, ఆయా గోశాలల భాద్యులు శ్రీమాన్ ఆరుట్ల శ్రీనివాసాచార్యులు, శ్రీ ఓం నారాయణ , కేసా హనుమంతరావు తదితరులు గోసేవలో పాల్గొన్నారు.

# సెల్లార్ పార్కింగ్‌పై ట్రాఫిక్ పోలీసుల నోటీసులు

**రోడ్లపై అక్రమ వాహనాల నిలిపివేతకు చెక్.. వ్యాపారులకు హెచ్చరిక**

**నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు: ఎస్ఐ సత్యానందం**




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ అక్టోబర్ 10:** హైదరాబాద్ (మియాపూర్)నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు నివారణగా మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు రహదారులు మరియు ఫుట్‌పాత్‌లపై అస్తవ్యస్తంగా వాహనాలు పార్క్ చేసి ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న వ్యాపార సంస్థల యజమానులకు నోటీసులు అందజేశారు నిజాంపేట్ ట్రాఫిక్ ఎస్ఐ సత్యానందం ఆధ్వర్యంలో పోలీసు బలగాల సిబ్బందితో కలిసి స్థానిక వాణిజ్య సముదాయాలు మరియు షాపుల వద్ద స్వయంగా పరిశీలించి ఈ నోటీసులను జారీ చేశారు సైబరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంత పోలీస్ చట్టం-2004లోని సెక్షన్ 7 సెక్షన్ 29(1)(ఎ)(అ) అలాగే హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ 1348 ఎఫ్ సెక్షన్ 2ల ప్రకారం చట్టపరంగా ఈ నోటీసులు ఇచ్చారుఈ సందర్భంగా నిజాంపేట్ ట్రాఫిక్ ఎస్ఐ సత్యానందం మాట్లాడుతూ బిల్డింగ్ ప్లాన్ ప్రకారం కేవలం వాహనాల పార్కింగ్ కోసమే కేటాయించిన సెల్లార్ స్థలాలను అనధికారికంగా ఇతర వ్యాపార అవసరాలకు లేదా గోదాములుగా వాడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది దీనివల్ల షాపులకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రోడ్లు మరియు ఫుట్‌పాత్‌లపై అస్తవ్యస్తంగా నిలపాల్సి వస్తోందని దీనివల్ల నిత్యం తీవ్ర ట్రాఫిక్ స్తంభన ఏర్పడుతోందని తెలిపారు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జీఓ ఎంఎస్ నంబర్ 168 నిబంధనల ప్రకారం ప్రతీ వాణిజ్య మరియు నివాస సముదాయం నిర్దేశిత శాతంలో పార్కింగ్ సదుపాయాన్ని తప్పనిసరిగా కల్పించాలి నిబంధనలు ఉల్లంఘించి సెల్లార్లను ఆక్రమించినా లేదా రోడ్లపై అడ్డంకులు సృష్టించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారుఈ నోటీసులలో భాగంగా అనధికారికంగా ఇతర అవసరాలకు వాడుతున్న సెల్లార్లను తక్షణమే ఖాళీ చేసి ఆమోదించిన నిబంధనల ప్రకారం కేవలం వాహనాల పార్కింగ్ కోసమే వినియోగించాలని ఆదేశించారు అలాగే వినియోగదారులు లేదా సిబ్బంది వాహనాలను రోడ్లు మరియు ఫుట్‌పాత్‌లపై నిలపకుండా షాపుల యజమానులే బాధ్యత వహించాలని తెలిపారు రహదారులపై ప్రజా రాకపోకలకు అడ్డంకిగా ఉన్న అన్ని రకాల వస్తువులను మరియు వాహనాలను వెంటనే తొలగించాలని ప్రజా సౌకర్యం దృష్ట్యా ప్రతీ వ్యాపారి పోలీసు శాఖకు సహకరించాలని అధికారులు స్పష్టం చేశారు

# గీతాంజలి హై స్కూల్ జవహర్ నగర్‌లో ఘనంగా బతుకమ్మ పండగ ఉత్సవాలు




**తొలి అక్షరం/జవహర్ నగర్, అక్టోబర్ 10:**గీతాంజలి హై స్కూల్ జవహర్ నగర్ లో ప్రిన్సిపాల్ కృష్ణవేణి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఉత్సవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణవేణి మాట్లాడుతూ బతుకమ్మ పండగ విశిష్టతను తెలియజేస్తూ మనం పకృతిని కాపాడడం, పువ్వులను పూజించడం, బతుకమ్మ పండుగను తొమ్మిది రోజులు జరుపుకుంటారని 9వ రోజున సద్దుల బతుకమ్మ పండుగ ఘనంగా జరుపుకుంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ నాగరాణి, టీచర్లు మరియు పాఠశాల విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

# మెరుపు ధర్నాతో స్పందించిన అధికారులు!

**- వలిగొండ రోడ్డు జంక్షన్ మార్గం పునరుద్ధరణకు చర్యలు**



**తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 10:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని వలిగొండ రోడ్డు జంక్షన్ వద్ద ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చెరుకు శివకుమార్ గౌడ్ స్థానికులతో కలిసి చేపట్టిన మెరుపు ధర్నా ఫలితాన్నిచ్చింది. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రోడ్డు మార్గాన్ని పునరుద్ధరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు.జంక్షన్ వద్ద రోడ్డు దాటేందుకు ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన శివకుమార్ గౌడ్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. సమస్య పరిష్కారం కోసం స్థానికులతో కలిసి గత రాత్రి ఆందోళన చేపట్టి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికారులు స్పందించి మార్గం పునరుద్ధరణకు చర్యలు ప్రారంభించారు.ప్రజా సమస్యపై స్పందించి, పరిష్కారం కోసం పోరాటం చేయడంపై స్థానికులు శివకుమార్ గౌడ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా సహకరించిన అధికారులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

# పట్టభద్రులారా.. ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోండి!

**- చిన్నకొండూరు పట్టభద్రులకు బీజేపీ నాయకుడు వుర సృజన్ కుమార్ గుప్తా విజ్ఞప్తి**



**తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 10:** చిన్నకొండూరు గ్రామంలోని అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని బీజేపీ నాయకుడు వుర సృజన్ కుమార్ గుప్తా విజ్ఞప్తి చేశారు. 2023 నవంబర్ కంటే ముందు డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు అర్హత నిబంధనలను పరిశీలించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఆదివారం, అక్టోబర్ 11న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చిన్నకొండూరు గ్రామంలో ఓటు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులు డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల మెమో, ఓటరు గుర్తింపు వివరాలు ఉంటే వాటితో పాటు ఆధార్ లేదా ఇతర గుర్తింపు పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకురావాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైనదని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఖమ్మం కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు ప్రారంభం

**- తొమ్మిది రోజుల పాటు శాఖల వారీగా వేడుకలు..**

**పర్యావరణహితంగా నిర్వహించాలని కలెక్టర్ సూచన**



**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 10:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల వేడుకల్లో భాగంగా మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మను వ్యవసాయ, మార్కెటింగ్ తదితర శాఖల ఆధ్వర్యంలో నిర్వహించారు. అధికారులు, మహిళా ఉద్యోగులు బతుకమ్మలను పేర్చి సంప్రదాయ పాటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు.బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ప్రకృతిపై ఆరాధనకు, తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఈ నెల 10 నుంచి 18వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా శాఖల వారీగా వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన సంబరాలు సద్దుల బతుకమ్మతో ముగియనున్నాయి.బతుకమ్మ వేడుకలను సంప్రదాయబద్ధంగా, పర్యావరణహితంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి సహజసిద్ధమైన పూలను ఉపయోగించాలని, చెరువులు, నిమజ్జన ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య, కలెక్టరేట్ కేర్‌టేకర్ వెంకన్న, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు





**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 10:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ వేడుకలు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఘనంగా జరిగాయి.ఈ వేడుకల్లో భాగంగా ఆడపడుచులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ ఆట ఆడారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ ఎం. రవిలి హాజరయ్యారు. వారితో పాటు ఎస్సై జి. సతీష్ సిబ్బంది లికమలాకర్ రెడ్డి, స్వామి నాయక్, సురేష్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొని బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఐ ఎం.రవి మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచుల గొప్ప పండుగ బతుకమ్మ అని, ఈ పండుగ ప్రకృతిని, మహిళా సాధికారతను చాటుతుందని అన్నారు. ప్రజలందరికీ బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమావాస్య రోజు అన్నదానం.. ఆర్యవైశ్య సంఘం సేవాభావం!

- చౌటుప్పల్ బస్టాండ్ వద్ద పేదలకు అన్నప్రసాదం పంపిణీ
- ప్రతి అమావాస్యకు ఉచిత అన్నదానం.. కాంచెట్టి చంద్రశేఖర్ గుప్తా



**తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 10:** పేదలకు అన్నదానం చేయడం ఎంతో సంతోషదాయకమని చౌటుప్పల్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కాంచెట్టి చంద్రశేఖర్ గుప్తా అన్నారు. శనివారం అమావాస్య సందర్భంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పేదలకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కాంచెట్టి చంద్రశేఖర్ గుప్తా తన చేతుల మీదుగా అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చౌటుప్పల్‌లో ఆర్యవైశ్య సంఘం సభ్యులందరూ ఐక్యంగా ముందుకు వచ్చి ప్రతి అమావాస్య రోజున బస్టాండ్ వద్ద పేదలకు ఉచితంగా అన్నదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం గొప్ప సేవాకార్యమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని, సేవాభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఈ అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తడకమళ్ల శ్రీనివాస్, కామిశెట్టి భాస్కర్ గుప్తా, నీల రమేష్ గుప్తా, ఇదంతా సీతారాములు, సింగరికొండ శ్రీను, నీళ్ల సత్యనారాయణ, నీల వెంకన్న, వీరమల్ల సూర్యనారాయణ, ఇడుపుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో సీపీఎం నేతల అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం!

## ఓటు హక్కును హరించే ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలి
## చౌటుప్పల్ జాతీయ రహదారిపై సీపీఎం శ్రేణుల నిరసన.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్



**తొలి అక్షరం/చౌటుప్పల్:అక్టోబర్ 10:** ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ, పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ సభ్యులు, ఇతర ప్రజాసంఘాల నాయకులు, నిరసనకారులను పోలీసులు అరెస్టు చేయడాన్ని సీపీఎం చౌటుప్పల్ కమిటీ తీవ్రంగా ఖండించింది. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కాలరాయడం అప్రజాస్వామిక చర్య అని సీపీఎం నాయకులు విమర్శించారు. శనివారం చౌటుప్పల్ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, ఎం.డి. పాషా, గోశిక కరుణాకర్, గంగాదేవి సైదులు మాట్లాడుతూ.. ఓటర్లను ఓటు హక్కుకు దూరం చేసే ప్రమాదం ఉన్న ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ) ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ప్రజలు నిరసనలు చేపట్టారని తెలిపారు. ఈ నిరసనలను అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు అణచివేత చర్యలకు పాల్పడటం దుర్మార్గమని విమర్శించారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న సమయంలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ, కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్, బృందా కారత్, బి.వి. రాఘవులు, ఎం.వి. గోవిందన్, విజయరాఘవన్, విజు కృష్ణ, అరుణ్‌కుమార్, మరియం దావలె, పార్లమెంట్ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ తదితర నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ప్రజలు చేస్తున్న పోరాటాలకు అరెస్టులు, అణచివేత చర్యలు అడ్డుకాలేవని నాయకులు స్పష్టం చేశారు. నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం ప్రభుత్వ భయాన్ని, ప్రజాస్వామ్య విలువల పట్ల నిర్లక్ష్యాన్ని వెల్లడిస్తోందని విమర్శించారు. దేశంలో మరోసారి అత్యవసర పరిస్థితులను తలపించే విధంగా పాలన సాగుతోందని మండిపడ్డారు. అరెస్టు చేసిన నాయకులు, నిరసనకారులను వెంటనే విడుదల చేయాలి. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, తొలగించిన ఓటర్ల పేర్లను తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును కాపాడేందుకు దేశవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు బండారు నరసింహ, బత్తుల దాసు, గోపగోని లక్ష్మణ్, యాట బాలరాజు, సప్పిడి రాఘవరెడ్డి, ఇట్టబోయిన శేఖర్, సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నకొర్పోల్‌లో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు





**తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 10:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చిన్నకొర్పోల్ గ్రామంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఆడబిడ్డలు, గ్రామ ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు, ఆడబిడ్డలందరికీ ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

# వేయి స్తంభాల గుడిలో ఘనంగా బతుకమ్మ వేడుకలు...

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** చారిత్రక రుద్రేశ్వరాలయంలో పరాభవ నామ సంవత్సర 2026 బతుకమ్మ వేడుకలు మహా వైభవంగా ప్రారంభమైనవి గత 50 సంవత్సరాలుగా దేవాలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని కులాలకు అతీతంగా ఈ వేడుకలను నిర్వర్తించుకోవడం ఆనవాయితీగా వస్తుంది మహిళలందరూ కూడా జానపద నృత్యంలతో ఒక్కేసి పువ్వేసి చందమామ అంటూ తెలంగాణ సాంస్కృతి ఉట్టిపడేలా తమ ఆటపాటలతో కోలాటాలతో చప్పట్లతో మన పూర్వీకుల సాంప్రదాయాన్ని అనుసరిస్తూ వేలాది మంది మహిళలు ఆడుకున్నారు నగర పాలక సంస్థ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో దే దివ్యమానంగా ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ కాంతులతో విరాజిల్లుతుండగా హనుమకొండ పట్టణ మహిళలు వేయి స్తంభాల దేవాలయ శిల్ప సౌందర్యాల మధ్య మహిళలు నూతన వస్త్రాలు దగదగా మెరిసే బంగారు ఆభరణాలతో పూలతో తంగేడు గునుగు గుమ్మడి ఆకుల పేర్చిన గౌరమ్మతో కలిసి దేవాలయ ప్రాంగణం అంతా క్రిక్కిరిసిపోయింది గత పది సంవత్సరాలుగా దేవాలయంలో రాదే శ్యాం సాహితీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వర్తించిన బతుకమ్మ పాటల పోటీలలో మహిళలు పాల్గొని తమ పాటలతో అందరినీ అలరించారు ఈ పోటీలలో పాల్గొన్న మహిళలకు రాదే శ్యాం సాహితీ సంస్థ ఆధ్వర్యంలో రాదేశాంసాహితీ సంస్థ అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ నేతృత్వంలో హనుమకొండ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మరియు వారి సతీమణి నీలిమ పాటల పోటీల్లో గెలుపొందిన మహిళలకు ప్రధమ ద్వితీయ తృతీయ మరియు కన్సోలేషన్ బహుమతులను వారికి అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాదే శ్యామ్ సాహితీ సంస్థ ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి,ఉత్సవ కమిటి ఉపాధ్యక్షులు పల్లం రమేష్,తౌటిరెడ్డి రవీందర్ రెడ్డి,బక్కి సతీష్ పాల్గొన్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి ధరణికోట అనిల్ కుమార్ మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మంచినీటి సౌకర్యం ప్రసాద పంపిణీ చేశారు. బతుకమ్మ పాటల్లో బహుమతులు అందుకున్న వారు మొదటి బహుమతి పంచనేని సుమ,ద్వితీయ బహుమతి కట్టా సౌజన్య,తృతీయ బహుమతి అంబటి గాయత్రి ఇంకా ఈ కార్యక్రమంలో దేవాదాయ సిబ్బంది పలువురు మాజీ కార్పొరేటర్ లు తోట వెంకటేశ్వర్లు ,పుప్పాల ప్రభాకర్,బోడా డిన్న పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. పాల్గొన్న మహిళలందరికీ కూడా ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలియజేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలకు పేరుపేరునా మన సంస్కృతిని తెలంగాణకే పరిమితమైన ఈ ఏకైక పండుగకు మహిళలు తండోపతండాలుగా పాల్గొనడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు.







# బతుకమ్మ పండుగ ఏర్పాట్లను పరిశీలించిన సర్పంచ్ భూక్య రమేష్ రాథోడ్

**తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 10:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బంజపల్లి గ్రామంలో బతుకమ్మ పండుగ ఏర్పాట్లను సర్పంచ్ భూక్య రమేష్ రాథోడ్ పరిశీలించారు. పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఆటస్థలం, బొడ్రాయి ప్రాంతాల్లో చేపట్టిన విద్యుత్ అలంకరణ పనులను పర్యవేక్షించారు. ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ గ్రామ ఆడబిడ్డలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో పండుగను ప్రశాంత వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఏర్ర సుజాత రాజు, వార్డు సభ్యుడు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, కృష్ణ, ఎరుకల కొమురయ్య, మల్లయ్య, విజేందర్, కుమారస్వామి, నాగరాజు, ముష్కు ప్రతాప్ రాజుతో పాటు పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# చిన్నకొర్పోల్ ఆడపడుచులందరికీ ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు



**తొలి అక్షరం/నెక్కొండ మండలం, అక్టోబర్ 10:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చిన్నకొర్పోల్ గ్రామ ఆడపడుచులందరికీ ఎంగిలిపూల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు. తెలంగాణ మట్టి పరిమళాన్ని, సంస్కృతి సంప్రదాయాల గొప్పతనాన్ని, ఆడబిడ్డల ఆత్మీయ అనుబంధాన్ని చాటిచెప్పే బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని ఆకాంక్షిస్తున్నాను. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ, కోలాటాలతో సంబరాలు చేసుకునే ఈ పండుగ ప్రతి ఆడబిడ్డ జీవితంలో కొత్త వెలుగులు నింపాలి. ప్రతి అక్క, ప్రతి చెల్లి, ప్రతి తల్లి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మన పండుగ.. మన సంస్కృతి.. మన బతుకమ్మ!కొయ్యడ సుధాకర్ గౌడ్‌నెక్కొండ మండల తొలి అక్షరం రిపోర్టర్

# చిందం రవికి రూ.2.50 లక్షల ఎల్ఓసీ అందజేసిన ఆకుల ఇంద్రసేనారెడ్డి

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సిఫారసుతో మంజూరు



**తొలి అక్షరం/చౌటుప్పల్: అక్టోబర్ 10:** మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గారి సిఫారసుతో చౌటుప్పల్ మున్సిపాలిటీ 12వ వార్డుకు చెందిన చిందం రవి (తండ్రి కృష్ణయ్య)కు మంజూరైన రూ.2 లక్షల 50 వేల విలువైన ఎల్ఓసీని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ ఆకుల ఇంద్రసేనారెడ్డి గారు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ.. అవసరమైన వారికి ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తూ.. ప్రజలకు, ప్రజాప్రతినిధులకు మధ్య వారధిగా ఆకుల ఇంద్రసేనారెడ్డి తన పాత్రను పోషించారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గారి సిఫారసుతో మంజూరైన ఎల్ఓసీని లబ్ధిదారుడికి అందజేయడం ద్వారా ఈ కార్యక్రమంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం అందడంతో చిందం రవి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గారికి, ఎల్ఓసీని అందజేసిన ఆకుల ఇంద్రసేనారెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పాక చిరంజీవి, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు మొగుదాల రమేష్‌గౌడ్, డీసీసీ కార్యదర్శి చింతల సాయిలు, మున్సిపాలిటీ ఉపాధ్యక్షులు చెరుకు లింగస్వామిగౌడ్, ఎర్రగుడి లింగస్వామి యాదవ్, ఇప్ప వెంకటేష్, వక్కాల కుమార్, మాదని గోపాల్, ఎండీ వహీద్, అంతటి బాలరాజుగౌడ్, గుండెబోయిన ఐలయ్య యాదవ్, దొమ్మాటి దయాకర్‌రెడ్డి, ఓర్సు రాజు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నకొర్పోల్‌లో సాయిశ్రీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**- కంటి, గుండె, షుగర్, బీపీ తదితర పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ**







**తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 10:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చిన్నకొర్పోల్ గ్రామంలో నర్సంపేట సాయిశ్రీ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ రామ్‌చంద్ ధరావత్ (ఎండీ), డాక్టర్ ఎస్. హైమావతి (ఎంఎస్, జనరల్ లాపరోస్కోపిక్ సర్జన్) ఆధ్వర్యంలో ఉదయం 8.30 గంటల నుంచి వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో చిన్నకొర్పోల్, చెరువుముందు తండా పరిసర గ్రామాల ప్రజలకు కంటి, గుండె సంబంధిత పరీక్షలతో పాటు షుగర్, బీపీ, కొవ్వు తదితర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి కూడా మందులు అందించారు. ఈ వైద్య శిబిరాన్ని సుమారు 200 నుంచి 400 మంది వరకు వినియోగించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సహకరించిన ఆర్ఎంపీ డాక్టర్ మోహన్‌కు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ భద్రకాళి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలకు అంకురార్పణ

**• 27 కిలోల పసుపుతో అమ్మవారికి అభిషేకం..**

**భక్తులకు జగత్ప్రసూతికా అలంకార దర్శనం**





**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** వరంగల్ మహానగరంలోని చారిత్రక శ్రీ భద్రకాళి దేవస్థానంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు శనివారం అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, జగత్ప్రసూతికా అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు సమర్పించిన 27 కిలోల స్వచ్ఛమైన పసుపుతో అమ్మవారికి హరిద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం వరకు భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారు. జగత్ప్రసూతికా అలంకార విశిష్టతను భద్రకాళి శేషు భక్తులకు వివరించారు. సమస్త జగత్తుకు మూలశక్తి అయిన జగన్మాత మహాలక్ష్మి నుంచే త్రిశక్తులు, సృష్టి, స్థితి, లయలకు సంబంధించిన శక్తులు ఆవిర్భవించాయని తెలిపారు. జగత్తును ప్రసవించిన తల్లికి ప్రతీకగా అమ్మవారిని పసుపుతో అలంకరించి పూజిస్తారని వివరించారు. ఈ ప్రత్యేక దర్శనం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఆలయంలో వాస్తు యాగం, పర్యగ్నికరణం నిర్వహించి సాయంత్రం అంకురార్పణ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. పరాభవ నామ సంవత్సర దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఉదయం 4 గంటలకు అమ్మవారి పూర్ణాభిషేకంతో ప్రారంభం కానున్నాయి. నవరాత్రుల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, ఉత్సవాలు నిర్వహించనున్నారు.

# బి-స్మాట్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కె. అనిత






**తొలి అక్షరం/రామన్నపేట, అక్టోబర్ 10:** బడ్జెట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (బి–స్మాట్) ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో రామన్నపేట మదర్ తెరిసా హైస్కూల్ ఉపాధ్యాయురాలు కె. అనిత ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. అక్టోబర్ 2న భువనగిరిలోని వివేరా హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ఆమె అవార్డును స్వీకరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారి భవిష్యత్తు అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మార్టిన్ కె. అనితను అభినందించారు.

# వివేకానందాస్ డివైన్ మోడల్ స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు




**తొలి అక్షరం/రామన్నపేట, అక్టోబర్ 10:** రామన్నపేటలోని వివేకానందాస్ డివైన్ మోడల్ స్కూల్‌లో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ కోలాటాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమానికి కేతేపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మమత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. పాఠశాల వ్యవస్థాపకులు మల్లేష్, వైస్ ప్రిన్సిపాల్ అస్మా, ఉపాధ్యాయులు సుధారాణి, అనిత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# నకిరేకల్‌లో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 10:** నకిరేకల్ మున్సిపాలిటీ కేంద్రంలోని మూసి రోడ్డులో శనివారం ఎంగిలిపూల బతుకమ్మ పండుగ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొని, నకిరేకల్ నియోజకవర్గ ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గార్లపాటి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దైద రవీందర్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతికి ప్రతీక అని అన్నారు.

# “అమ్మలగన్న అమ్మవు నువ్వే“ దుర్గామాత భక్తి గీతం విడుదల

**- ప్రముఖ గేయ రచయిత గడ్డం శీను కలం నుండి మరో భక్తి గీతం**



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 10;** భక్తి పాటలతో తనదైన ముద్ర వేసుకున్న ప్రముఖ గేయ రచయిత గడ్డం శ్రీను కలం నుండి మరో అద్భుతమైన భక్తి గీతం రాబోతోంది. దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని “అమ్మలగన్న అమ్మవు నువ్వే“ అనే దుర్గామాత భక్తి పాటను ఆయన రచించారు. ఈ పాట రెండు రోజుల్లో జీ ఎస్ పి మ్యూజికల్ ఛానల్ ద్వారా విడుదల కానుంది. ఈ పాటకు సాహిత్యం గడ్డం శ్రీను అందించగా, ప్రముఖ గాయనీమణులు మాసంపల్లి పద్మ, చకిలం కవిత, అంతటి రమ్య మధురంగా ఆలపించారు. సంగీతం, సౌండ్ మిక్సింగ్ బాధ్యతలను చరణ్ నిర్వహించారు. ఈ పాట ఎల్ నగర్ రవి మ్యూజిక్ స్టూడియోలో రికార్డ్ చేయబడింది. ఈ సందర్భంగా గడ్డం శ్రీను మాట్లాడుతూ “నా చేతి నుండి జాలువారిన ఈ ఆణిముత్యం లాంటి దుర్గామాత పాట ప్రతి ఒక్కరి హృదయాన్ని తాకుతుందని ఆశిస్తున్నాను. దసరా పండుగ సందర్భంగా భక్తులందరూ ఈ పాటను ఆదరించి ఆశీర్వదించాలని, ఆ జగన్మాత దుర్గమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటున్నాను“ అని తెలిపారు. ఇప్పటికే ఈ పాటకు సంబంధించిన ప్రోమో సోషల్ మీడియాలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. పూర్తి పాట కోసం భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# రామన్నపేట మండల వ్యాప్తంగా ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు









**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 10:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగలో భాగంగా రామన్నపేట మండల వ్యాప్తంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు శనివారం ఘనంగా జరిగాయి. మండలంలోని అన్ని గ్రామాలలో మహిళలు, ఆడపడుచులు ఉదయం నుండే రకరకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. సాయంత్రం గ్రామ కూడళ్లలో, దేవాలయాల వద్ద బతుకమ్మలను పెట్టి, చుట్టూ చేరి బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ సంబరాలు జరుపుకున్నారు. ముఖ్యంగా నీర్నెముల గ్రామంలో యువతులు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొని బతుకమ్మ ఆట ఆడారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో మొదటి రోజు అయిన ఎంగిలిపూల బతుకమ్మకు విశేష ప్రాధాన్యత ఉంది. ఈ రోజు నుంచే తెలంగాణ ఆడపడుచుల ఇళ్లల్లో పండుగ వాతావరణం నెలకొంది. బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధించే పండుగ అని, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని పలువురు అన్నారు. ఈ సంబరాల్లో మహిళలు, యువతులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు ప్రశాంతంగా, ఉత్సాహభరితంగా జరిగాయి.

# మునుగోడు ప్రజలకు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి బతుకమ్మ శుభాకాంక్షలు




**తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 10:** ఎంగిలిపూల బతుకమ్మ పండుగ సందర్భంగా మునుగోడు నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పండుగతో ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.



# టీజేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా సిర మహేష్

**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 10:** తెలంగాణ జర్నలిస్టుల జేఏసీ యాదాద్రి–భువనగిరి జిల్లా ఉపాధ్యక్షుడిగా రామన్నపేటకు చెందిన అక్షిత న్యూస్ కరస్పాండెంట్ సిర మహేష్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు తొగరి కరుణాకర్ ఆదేశాల మేరకు ప్రధాన కార్యదర్శి బత్తుల గణేష్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ బుంగ చాందిని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తానని సిర మహేష్ తెలిపారు.

# చిన్ననాగారంలో చిన్నారి బతుకమ్మ సందడి..

**చూపుతిప్పుకోలేని అందమైన దృశ్యం!**

**చేతిలో బతుకమ్మ.. అడుగుల్లో ఆనందం!**

**తెలంగాణ సంస్కృతిని చాటుతున్న చిన్నారి ముచ్చటైన వేడుక!**



**తొలి అక్షరం/ఇనుగుర్తి అక్టోబర్ 10:** ఇనుగుర్తిమండలం, చిన్ననాగారంతెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేళ చిన్ననాగారం గ్రామానికి చెందిన ఈ చిన్నారి పూల బతుకమ్మను చేతబట్టి ఎంతో ముచ్చటగా బయలుదేరిన దృశ్యం అందరినీ ఆకట్టుకుంటోంది. చిన్నారి ఉత్సాహం, బతుకమ్మపై ఉన్న అభిమానం పండుగ శోభను మరింత పెంచుతున్నాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు బతుకమ్మ సంబరాల్లో భాగస్వాములు కావడం తెలంగాణ సంప్రదాయానికి నిదర్శనంగా నిలుస్తోంది.

# ఇంద్రపాలనగరం గ్రామ ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు

**- గర్దాస్ విక్రమ్ సర్పంచ్ ఇంద్రపాలనగరం**



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 10:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ సందర్భంగా ఇంద్రపాలనగరం గ్రామ సర్పంచ్, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం జేఏసీ రాష్ట్ర కార్యదర్శి గర్దాసు విక్రమ్ ఆడబిడ్డలందరికీ ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ – తీరొక్క పూలతో తీర్చిదిద్ది, ఆటపాటలు, కోలాటాలు అవధులు లేని ఆడబిడ్డల ఆనందాలతో జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి నిదర్శనమని అన్నారు. ప్రకృతిని పూజించే ఏకైక పండుగ బతుకమ్మ అని, మహిళలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకలు రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఘనంగా జరగాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాల ఆడపడుచులకు మరోసారి ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

# ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ..

### పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి
### ఝాన్సీ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా
### ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు









**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) అక్టోబర్ 10:** తొర్రూరు తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, సంప్రదాయాలకు, ప్రకృతి ఆరాధనకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, వేటా అధ్యక్షురాలు, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. తొర్రురు మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలకు వేటా (ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ తెలుగు అసోసియేషన్)ఇండియా అనుసంధానం చేసుకొని శనివారం తొర్రూరు పెద్ద చెరువు సమీపంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రాజేందర్ రెడ్డి పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. మహిళల కోలాహలంతో తొర్రూరు పెద్ద చెరువు పరిసరాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయం మహిళల్లో ఐక్యతను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, వారసత్వాన్ని భావితరాలకు అందిస్తుందని తెలిపారు. మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబన, సామాజిక గౌరవం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొంటూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంలో బతుకమ్మ వంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమా రజిని రాజశేఖర్, పట్టణ వార్డు కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ముద్దసాని సురేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చారి, కౌన్సిలర్లు సీనియర్ నాయకులు చాపల బాపురెడ్డి, పెదగాని కళావతి సోమయ్య, బసనబోయిన ఐలమ్మ, జాటోత్ భద్రు నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పరస్పర గౌరవంతోనే ఆరోగ్యకర బంధాలు







### -కోపం,అహంకారాన్ని విడనాడాలి
### -స్టాండ్ విత్ హర్ చర్చావేదికలో డీజీ చారు సిన్హా
### -ఆరోగ్యకరమైన సంబంధాలకు పరస్పర గౌరవం, భావోద్వేగ నియంత్రణ అవసరం

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),అక్టోబర్10:** కోపం,అహంకారం,ఆధిపత్య ధోరణులతో కూడిన విషపూరిత పురుషాధిక్య భావజాలాన్ని మార్చుకోవాలని సీఐడీ,ఏసీబీ, మహిళా భద్రత విభాగాల డీజీ చారు సిన్హా అన్నారు. పురుషులు అలవర్చుకున్న ప్రవర్తనలను మార్చుకోవడం కూడా సాధ్యమేనని పేర్కొన్నారు. పురుషులు,మహిళలు ఒకరికొకరు పరస్పర పూరకాలని,ఎవరూ ఎక్కువ లేదా తక్కువ కాదని స్పష్టం చేశారు. స్టాండ్ విత్ హర్ ప్రచారంలో భాగంగా శనివారం హైదరాబాద్‌లోని వీహబ్,డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిర్వహించిన ఎనిమిదో చర్చావేదికలో ఆమె మాట్లాడారు.

**భావోద్వేగాలను నియంత్రించుకోవాలి:** వాదన జరిగినప్పుడు భావోద్వేగాలను అదుపులోకి తెచ్చుకునేందుకు కొంత సమయం తీసుకోవడం మంచిదేనని అనూష సూచించారు. అయితే తనకు కొంత సమయం అవసరమని ఎదుటివారికి తెలియజేయకపోతే అపార్థాలు ఏర్పడతాయని చెప్పారు. కుటుంబం, సమాజంలో లింగ వివక్షకు సంబంధించిన పాత భావజాలాన్ని పురుషులతోపాటు మహిళలు కూడా కొనసాగిస్తున్నారని నటి,యాంకర్ ఝాన్సీ పేర్కొన్నారు. ఇలాంటి ధోరణులను ప్రతి ఒక్కరూ గుర్తించి మార్చుకోవాలని సూచించారు.

**క్రీడలతో ఒత్తిడికి దూరం:** కోపాన్ని నిర్మాణాత్మకంగా మళ్లించేందుకు క్రీడలు, శారీరక వ్యాయామాలు దోహదపడతాయని నటుడు వంశీ చాగంటి అన్నారు. విభేదాలు వచ్చినప్పుడు వాదనలో గెలవడం కంటే సంబంధాలను కాపాడుకోవడం ముఖ్యమని కార్మిక శాఖ ప్రత్యేక కమిషనర్ పమేలా సత్పతి అన్నారు. మహిళల అభిప్రాయాలు, అనుభవాలను తక్కువగా చూడటం, వారికి తెలిసిన విషయాలను అనవసరంగా వివరించడం వంటి ధోరణులను గుర్తించి మార్చుకోవాలని వీహబ్ సీఈఓ సీత పల్లచొల్ల సూచించారు.

**సమానత్వమే లక్ష్యం:** కోపం,అహంకారం,వివక్షాపూరిత ధోరణులను అధిగమించేందుకు పరస్పర చర్చించుకోవడం ఇతరుల అభిప్రాయాలకు గౌరవం,స్వీయ నియంత్రణ అవసరమని వక్తలు పేర్కొన్నారు. స్టాండ్ విత్ హర్ కార్యక్రమం ద్వారా ప్రతి నెలా ఒక అంశంపై చర్చలు నిర్వహిస్తూ లింగ సమానత్వం, పరస్పర గౌరవం, సామాజిక మార్పుపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ చర్చలో సీడీఈడబ్ల్యూ, మహిళా భద్రత విభాగానికి చెందిన అనూష, నటి ఝాన్సీ, నటుడు వంశీ చాగంటి, వీహబ్ సీఈఓ సీత పల్లచొల్ల, ఐఏఎస్ అధికారి పమేలా సత్పతి, టీవీ9 సీనియర్ వార్తా వ్యాఖ్యాత దీప్తి వాజ్‌పేయి,పోలీస్ అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్థిక సహాయం



**తొలి అక్షరం/దంతాలపల్లి అక్టోబర్ 10:** దంతాలపల్లి మండలం పెద్ద ముప్పారం గ్రామంలో ఈదురు జనార్ధన్ కుటుంబానికి టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పంపిన పది లక్షల చెక్కును జనార్ధన్ కుటుంబానికి అందజేస్తున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మహబూబాద్ మాజీ పార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవిత మాజీ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్ మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బిందు మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్ రెడ్డి ఒలాద్రి మల్లారెడ్డి ధర్మారపు వేణు వీరబోయిన కిషోర్ నాగిరెడ్డి వెంకటరెడ్డి సంజీవ సర్పంచ్ భరత్ వెంకన్న పాల్గొన్నారు.

## ఇండో పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- బతుకమ్మ పాటలతో మార్మోగిన ఇండో పాఠశాల.. ఆటపాటలతో విద్యార్థినుల కోలాహలం!





**తొలి అక్షరం/షాద్ నగర్,అక్టోబర్ 10:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను షాద్‌నగర్ కిషన్‌నగర్‌లోని ఇండో పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. విద్యార్థినులు, ఉపాధ్యాయినులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ సాగర్ చిన్నబాతిని మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయబద్ధంగా పూజించడం ఈ పండుగ ప్రత్యేకత అని వివరించారు. ఇలాంటి వేడుకల ద్వారా విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. భావితరాలకు మన సంస్కృతిని పరిచయం చేయడంలో పాఠశాలలు కీలక పాత్ర పోషించాలని అన్నారు. పండుగ వేడుకలతో విద్యార్థినుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ప్రిన్సిపల్ సాయికిరణ్, వైస్ ప్రిన్సిపల్ భార్గవి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంద్రపాలనగరం వెంకటేశ్వర స్వామి ఆలయంలో లైటింగ్ బోర్డు ప్రారంభం

**తొలి అక్షరం/ రామన్నపేట అక్టోబర్ 10:** రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం (తుమ్మలగూడెం) గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో కోరమండల్ కంపెనీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన లైటింగ్ బోర్డును తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం జేఏసీ రాష్ట్ర కార్యదర్శి, సర్పంచ్ గర్దాసు విక్రమ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, నక్క వెంకటేష్, రవ్వ నర్సింహా, రేపాక సత్తయ్య, భువనగిరి శ్రీనివాస్, బొల్ల నర్సింహా, భువనగిరి మహేష్, వడ్లకొండ కిరణ్, గర్దాసు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి కోరమండల్ కంపెనీ అందిస్తున్న సహకారం అభినందనీయమని సర్పంచ్ విక్రమ్ ఈ సందర్భంగా తెలిపారు.



# కత్రినా కైఫ్, కృతి సనన్‌లకు మద్దతుగా మృణాల్



బాలీవుడ్ నటీనటులపై, ముఖ్యంగా హీరోయిన్ల వ్యక్తిగత జీవితాలు, దుస్తులు, శరీరాకృతిని లక్ష్యంగా చేసుకుని పెరుగుతున్న ఆన్‌లైన్ ట్రోలింగ్‌పై నటి మృణాల్ ఠాకూర్ తీవ్రంగా స్పందించారు. తోటి నటీమణులు కత్రినా కైఫ్, కృతి సనన్‌లకు ఆమె బాసటగా నిలిచారు. ప్రతి ఒక్కరికీ తమ జీవితాన్ని ఇష్టానుసారం జీవించే హక్కు ఉంటుందని, ఇతరుల వ్యక్తిగత ఎంపికలను విమర్శించే అధికారం ఎవరికీ లేదని ఆమె స్పష్టం చేశారు.

ఇటీవల తన 'పూజా మేరీ జాన్' సినిమా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మృణాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రసవానంతర శారీరక మార్పుల కారణంగా కత్రినా కైఫ్ బాడీ షేమింగ్‌కు గురికావడం, ఒక జువెలరీ యాడ్‌లో ధరించిన దుస్తుల కారణంగా కృతి సనన్ విమర్శలు ఎదుర్కోవడం వంటి సంఘటనల నేపథ్యంలో ఆమె స్పందించారు. కత్రినా, కృతి ఇద్దరూ సినిమా రంగానికి ఎంతో సేవ చేశారని, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారని గుర్తుచేశారు. "ప్రతి విషయంలోనూ తప్పులు వెతకడం మానుకోవాలి. సోషల్ మీడియాలో కొందరి ప్రవర్తన చూస్తుంటే పిచ్చి పట్టినట్లుంది" అని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. వారి కృషిని, విజయాన్ని మరిచిపోయి చిన్న విషయాలపై దృష్టి పెట్టడం సరికాదన్నారు. ఒకప్పుడు మహిళలను మాత్రమే ఎక్కువగా విమర్శించేవారని, కానీ ఇప్పుడు పురుషులు కూడా ఇలాంటివి ఎదుర్కొంటున్నారని మృణాల్ పేర్కొన్నారు. కాగా, విమర్శల నేపథ్యంలో కృతి సనన్ నటించిన జ్యువెలరీ ప్రకటనను సంబంధిత సంస్థ ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే.

## రజనీకాంత్ 'జైలర్ 2' టిక్కెట్ రేట్ల పెంపునకు ఏపీ ప్రభుత్వం అనుమతి

రోజుకు ఐదు షోలు ప్రదర్శించుకునేందుకు కూడా అనుమతి

సూపర్ స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'జైలర్ 2' టికెట్ ధరలను పెంచుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. దసరా పండుగ కానుకగా అక్టోబరు 15న ఈ చిత్రం విడుదలవుతున్న నేపథ్యంలో, తొలి వారం రోజుల పాటు పెంచిన ధరలు అమల్లో ఉంటాయని పేర్కొంటూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ ధరపై గరిష్ఠంగా రూ. 50 (జీఎస్టీతో కలిపి), మల్టీప్లెక్స్‌లలో రూ. 75 (జీఎస్టీతో కలిపి) అదనంగా వసూలు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఈ పెరిగిన ధరలు సినిమా విడుదలైన అక్టోబరు 15 నుంచి అక్టోబరు 21 వరకు, అంటే వారం రోజుల పాటు వర్తిస్తాయి.



# 'రణబాలి' ట్రైలర్‌పై చిత్ర బృందాన్ని ప్రశంసించిన మంత్రి లోకేశ్

### థ్యాంక్స్ లోకేశ్ అన్నా..
### సీమ గడ్డ గర్వపడే సినిమా ఇది: విజయ్ దేవరకొండ



విజయ్ దేవరకొండ, రష్మిక మందానా జంటగా నటిస్తున్న 'రణబాలి' సినిమా ట్రైలర్‌పై ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రశంసలు కురిపించారు. దీనిపై హీరో విజయ్ దేవరకొండ భావోద్వేగంగా స్పందిస్తూ, ఈ సినిమా ద్వారా రాయలసీమ గడ్డకు తాను రుణం తీర్చుకుంటున్నానని తెలిపారు. విజయ్ దేవరకొండ హీరోగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో 'రణబాలి' అనే పీరియాడిక్ మూవీ తెరకెక్కింది. ఇటీవల విడుదలైన ఈ చిత్ర ట్రైలర్‌ను వీక్షించిన మంత్రి లోకేశ్ చిత్ర బృందాన్ని అభినందించారు. రాయలసీమ చారిత్రక పోరాటాన్ని, బ్రిటిష్ పాలకుల అణచివేతను అద్భుతంగా ఆవిష్కరించారని ఆయన కొనియాడారు.లోకేశ్ ప్రశంసలపై విజయ్ దేవరకొండ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "లోకేశ్ అన్నా.. రాయలసీమ నేల నాకు ఎంతో ఇచ్చింది. ఈ గడ్డకు నేను తిరిగి చెల్లించాల్సిన బాధ్యత, రుణం ఈ సినిమా రూపంలో నెరవేరుతోంది. మీ సందేశం మా చిత్ర యూనిట్‌లో రెట్టింపు ఉత్సాహాన్ని నింపింది. మన నేల గొప్పతనాన్ని, మన ప్రజల ఆత్మగౌరవాన్ని చూసి ప్రతి ఒక్కరి గుండె గర్వంతో ఉప్పొంగేలా ఈ చిత్రం ఉంటుంది. వెండితెరపై ఒక అద్భుతమైన అనుభూతి మీకోసం వేచి చూస్తోంది" అంటూ లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

# నెట్‌ఫ్లిక్స్‌లో భారీ కోతలు..

### 800 మంది ఉద్యోగుల తొలగింపునకు రంగం సిద్ధం!




ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ తమ ఉద్యోగులకు భారీ షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. కంపెనీలోని మొత్తం సిబ్బందిలో సుమారు 5 శాతం మందిని, అంటే దాదాపు 800 మంది ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైనట్లు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. దీనికి సంబంధించిన ప్రకటన వచ్చే వారంలోనే ఉండవచ్చని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులను ఉటంకిస్తూ పలు నివేదికలు పేర్కొంటున్నాయి.2025 చివరి నాటికి నెట్‌ఫ్లిక్స్‌లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 16,000 మంది ఫుల్ టైమ్ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 68 శాతం మంది అమెరికా, కెనడాలోనే పనిచేస్తున్నారు. తాజా తొలగింపులు కార్యరూపం దాల్చితే, 2022 తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లో ఇదే అతిపెద్ద ఉద్యోగాల కోత కానుంది. ఆ సమయంలో కూడా వృద్ధి మందగించడం, సబ్‌స్క్రైబర్లు తాత్కాలికంగా తగ్గడంతో వందలాది మందిని కంపెనీ తొలగించింది. ప్రస్తుతం వినిపిస్తున్న వదంతులపై స్పందించేందుకు నెట్‌ఫ్లిక్స్ నిరాకరించింది.అయితే, ఏయే విభాగాలపై ఈ కోతల ప్రభావం ఎక్కువగా ఉంటుందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఫీచర్ ఫిల్మ్‌లపై పనిచేస్తున్న క్రియేటివ్ టీమ్‌లలో కోతలు ఉండవచ్చని భావిస్తున్నారు. స్ట్రీమింగ్ మార్కెట్‌లో తీవ్రమైన పోటీ, మీడియా సంస్థల విలీనాలు, యూట్యూబ్ వంటి ప్లాట్‌ఫారమ్‌లు వీక్షకులను, ప్రకటనల ఆదాయాన్ని ఎక్కువగా ఆకర్షిస్తుండటం నెట్‌ఫ్లిక్స్‌కు సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో నెట్‌ఫ్లిక్స్ తన వ్యాపార వ్యూహాన్ని మార్చుకుంటోంది. కేవలం సబ్‌స్క్రిప్షన్‌లపై ఆధారపడకుండా, ప్రకటనలతో కూడిన ప్లాన్‌లు, లైవ్ ప్రోగ్రామింగ్, గేమింగ్ వంటి కొత్త రంగాలపై దృష్టి సారిస్తోంది. ఇటీవల ఒక సదస్సులో మాట్లాడిన కంపెనీ కో-సీఈఓ టెడ్ సారండోస్, తాము వృద్ధి చెందుతున్నప్పటికీ, నాయకత్వం ఆశించిన స్థాయిలో వేగంగా వృద్ధి సాధించలేకపోతున్నామని అంగీకరించారు.ఆర్థికంగా చూస్తే.. ఈ ఏడాది జూలైలో ప్రకటించిన రెండో త్రైమాసిక ఫలితాల్లో కంపెనీ 12.56 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఇది గత ఏడాదితో పోలిస్తే 13 శాతం అధికం. అయినప్పటికీ, 2026 పూర్తి సంవత్సరానికి గాను ఆదాయ అంచనాలను తగ్గించడం, గత ఏడాదిగా కంపెనీ షేరు ధర గణనీయంగా క్షీణించడం వంటి పరిణామాలు పెట్టుబడిదారులలో ఆందోళన కలిగిస్తున్నాయి. అక్టోబర్ 20న కంపెనీ తదుపరి త్రైమాసిక ఫలితాలను ప్రకటించనున్న నేపథ్యంలో ఈ పునర్వ్యవస్థీకరణ చర్యలకు ప్రాధాన్యం ఏర్పడింది.

# 'ధురంధర్' మరో ఘనత..
## గ్రామీ అవార్డుల బరిలో సౌండ్ ట్రాక్



రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కిన 'ధురంధర్', 'ధురంధర్-2' సినిమాలు ఏ రేంజ్‌లో సక్సెస్ సాధించాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అదిత్య ధర్ తెరకెక్కించిన ఈ రెండు సినిమాలను ప్రేక్షకులకు విశేషంగా ఆదరించారు. ఒటిటిలోనూ ఈ సినిమాలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. అయితే 'ధురంధర్-2: ది రివేంజ్' సినిమా మరో ఘనతను సాధించింది. ఈ సినిమా ఆల్బమ్ 2027 గ్రామీ అవార్డుల బరిలో నిలిచింది. మొత్తం 8 విభాగాల్లో అవార్డుల పరిశీలనకు పంపినట్లు నిర్మాణ సంస్థ 'బి62 స్టూడియోస్' అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. ఈ సినిమాకు శాశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందించారు. విజువల్ మీడియాకు సంబంధించి సౌండ్‌ట్రాక్‌గా 'ధురంధర్' ఆల్బమ్‌ని పోటీకి పంపారు. అలాగే పలు పాటలను వేర్వేరు విభాగాల్లో గ్రామీ పరిశీలనకు పంపించారు.

# 'రామాయణ' సినిమాలో మండోదరి పాత్రలో కాజల్ అగర్వాల్



టాలీవుడ్‌లో కాజల్ అగర్వాల్ అడుగు పెట్టి దాదాపు రెండు దశాబ్దాలు అవుతున్నా ఇప్పటికీ హీరోయిన్‌గానే వరుసగా సినిమాలు చేస్తూనే ఉంది. పెళ్లయి బాబు పుట్టిన తర్వాత కూడా తన సినిమాల ఎంపిక విషయంలో తేడా చూపించకుండా కమర్షియల్ పాత్రలను చేయడం చూడవచ్చు. ప్రస్తుతం కాజల్ 'రామాయణ' సినిమాలో మండోదరి పాత్రలో కనిపించబోతోంది. కెరీర్ చివరి దశలో ఉందని భావిస్తున్న సమయంలో రణబీర్ కపూర్, సాయి పల్లవిలు రాముడు, సీత పాత్రలో నటిస్తున్న రామాయణ సినిమాలో కాజల్ అగర్వాల్ కి రావణుడి పాత్రలో నటిస్తున్న యశ్ కి భార్య పాత్రలో నటించే అవకాశం దక్కింది. కచ్చితంగా మండోదరి పాత్రతో కాజల్ మరో నాలుగు, అయిదు ఏళ్లు ఇండస్ట్రీలో కొనసాగే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది దీపావళికి 'రామాయణ 1' సినిమా రాబోతుంది. వచ్చే ఏడాదిలో 'రామాయణ 2' రానుంది.

# ఎలాన్ మస్క్‌కు కమల్ హాసన్ స్ట్రాంగ్ కౌంటర్.. మద్దతుగా కంగనా



టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ చేసిన వ్యంగ్య వ్యాఖ్యలపై ప్రముఖ సినీ నటుడు, రాజ్యసభ ఎంపీ కమల్ హాసన్ తీవ్రంగా స్పందించారు. దేశ విధానాలను ఏ బిలియనీర్ నిర్దేశించలేరని స్పష్టం చేశారు. కమల్ వ్యాఖ్యలకు నటి, ఎంపీ కంగనా రనౌత్ మద్దతు తెలిపారు.

భారత్‌లో స్టార్‌లింక్ సేవలకు లైసెన్సింగ్ ప్రక్రియలో జరుగుతున్న జాప్యంపై ఎలాన్ మస్క్ సోషల్ మీడియాలో స్పందిస్తూ, భారత ప్రధాని అంబానీనా? అంటూ సెటైరిక్ గా ట్వీట్ చేశారు. దీనిపై కమల్ హాసన్ దీటుగా బదులిచ్చారు. "ఏ బిలియనీర్ అయినా, అది భారతీయ అయినా, అమెరికన్ అయినా... దేశ విధానాలను నిర్దేశించలేరు. ప్రతి దేశం తన సొంత ప్రయోజనాల ఆధారంగానే నిర్ణయాలు తీసుకుంటుంది" అని ఆయన పేర్కొన్నారు.స్వేచ్ఛా వాణిజ్యం గురించి చెప్పే పశ్చిమ దేశాలు రక్షణాత్మక విధానాలు పాటిస్తున్నాయని కమల్ విమర్శించారు. "చైనా ఎలక్ట్రిక్ వాహనాలపై అమెరికా 100 శాతం సుంకాలు విధించి తన దేశీయ పరిశ్రమను కాపాడుకుంటోంది. భారత్ కూడా అదే విధంగా తన దేశీయ తయారీ రంగాన్ని పరిరక్షించుకోవడానికి చర్యలు తీసుకుంటోంది" అని వివరించారు.

"భారత్ ఒక ప్రజాస్వామ్య దేశం, వలస పాలిత ప్రాంతం (కాలనీ) కాదు. మేము ప్రపంచాన్ని స్వాగతిస్తాం. కానీ మా భవిష్యత్తును భారత ప్రజలమే నిర్ణయించుకుంటాం" అని కమల్ హాసన్ తన పోస్టులో తేల్చిచెప్పారు.

కమల్ పోస్టును రీషేర్ చేస్తూ కంగనా రనౌత్ స్పందించారు. "ఇది మస్క్‌కు బాగా తగిలి ఉంటుంది. ఏ బిలియనీర్ దేశ విధానాలను నిర్దేశించకూడదు. కమల్ చాలా స్పష్టంగా, వ్యంగ్యంగా, సూటిగా చెప్పారు" అంటూ ప్రశంసించారు. ఇప్పటికే మస్క్ ఆరోపణలను భారత కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ నిరాధారమైనవని కొట్టిపారేసిన విషయం తెలిసిందే.